నిజామాబాద్ సీపీగా వి.సత్యనారాయణ

- రాచకొండ కమిషనరేట్ నుంచి బదిలీ



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్‌కమిషనరేట్‌కు ఎట్టకేలకు సీపీని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాచకొండ సీపీగా విధులు నిర్వర్తిస్తున్న వి.సత్యనారాయణకు నిజామాబాద్ సీపీగా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కరీంనగర్ సీపీగా విధులు నిర్వర్తించిన సమయంలో ఈ ఏడాది జనవరిలో రాచకొండకు బదిలీ చేశారు. తదనంతరం నిజామాబాద్‌కు బదిలీపై సీపీగా విధులు నిర్వర్తించనున్నారు.

1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

శనివారం | సెప్టెంబర్ 02, 2023 | www.navatelangana.com

అప్పులు చేసి ఇంటి నిర్మాణం

- గృహలక్ష్మి మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-రెంజల్

అప్పులు చేసి డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించుకున్న వారికి గృహలక్ష్మి పథకం కింద నగదుసాయం అందజేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు వినతిపత్రం అందజేశారు. గత రెండు సంవత్సరాల కిందట డబుల్ బెడ్ రూమ్ ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గత రెండు సంవత్సరాల కిందట ఎంపిక చేశారని ఎమ్మార్పీఎస్ బోధన్ డివిజన్ ఇంచార్జ్ లక్ష్మి గారి భూమయ్య తెలిపారు. 50 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి వారి సొంత స్థలంలో ఇండ్ల నిర్మాణం చేపట్టుకోవాలని, అధికారులు ఆదేశాలు ఇవ్వడంతో, లబ్ధిదారులు ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వ మంజూరు చేసిందని ఆయన అన్నారు. కొంతమంది లబ్ధిదారులు వడ్డీ వ్యాపారుల వద్ద డబ్బు తీసుకువచ్చి ఇంటి నిర్మాణం చేపట్టారని తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి కావలసిన నిధులను వెంటనే మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు తెలిపారు.

ప్రయాణం.. నిత్యగండం



ఆటోలోపల కూర్చునేందుకు వీలు లేక ఆటోను పట్టుకొని వేలాడుతున్న ఓ విద్యార్థి

- పరిమితికి మించి విద్యార్థులను కుక్కి తరలిస్తున్న పలు ఆటోవాలాలు
- తనిఖీలు చేపట్టి అవగాహన కల్పించాలని కోరుతున్న తల్లిదండ్రులు

నవతెలంగాణ-నిజామాబాద్

పోలీసులు అవగాహన కల్పిస్తున్నా.. పలువురి ఆటోవాలాల తీరు మారడం లేదు. ప్రమాదమని తెలిసినా.. పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తూ ప్రయాణం.. నిత్య గండంగా మారుస్తున్నారు. పరిమితికి మించి పలువురి ఆటోవాలలు విద్యార్థులను తరలిస్తుం డటంతో ఎక్కడ ఎలాంటి ప్రమాదం ముంచు కోస్తుందో అని ఆందోళన వ్యక్తమవుతుంది.

స్కూళ్లకు, కాలేజీలకు విద్యార్థులను తరలించేం దుకు పలు ఆటోవాలాలు పరిమితికి మించి 10 నుంచి 15 మంది విద్యార్థులను కిక్కిరిసేలా కూర్చొబెట్టి ప్రయాణం సాగిస్తున్నారు. డ్రైవర్ ఇరు పక్కల సైతం విద్యార్థులు కూర్చొబెట్టుకొని ఆటో నడుపుతుండటంతో.. అనుకోని ఘటన జరిగితే పెనుప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉంది. స్కూళ్లు, కాలేజీ యాజమాన్యాలు దృష్టిసారించి పరిమితికి మించి పిల్లలను ఎక్కించుకోకుండా చర్యలు తీసుకోవాలి. తల్లిదండ్రులు సైతం ఓ కంట కనిపెట్టాలి. ఆర్టీవో అధికారులు, పోలీసులు స్పందించి స్కూల్లు, కాలేజీ పరిసరాల్లో నిఘా ఏర్పాటు చేసి పరిమితికి మించి తరలిస్తున్న ఆటోవాలాలకు అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆత్మగౌరవ భవనాలు కేటాయించాలి

- కొత్త సంచార కులాల సమస్యలపై వినతి

నవతెలంగాణ-నవీపేట్



మాజీ స్పీకర్ మధుసూదనచారికి వినతిపత్రం అందజేత

కొత్తగా బీసీ-ఏ జాబితాలో చేర్చిన 13 కులాల వారికి ఆత్మగౌరవ భవనాలు కేటాయించాలని ఆయా కులాల వారు కోరారు. మాజీ స్పీకర్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుక్రవారం విన్నవించారు. ఈ సందర్భంగా 13 సంచార కులాలను ఎంబీసీ జాబితాలో చేర్చి లక్ష ఆర్థిక సహకారంతో పాటు ఆత్మగౌరవ భవనాలను కేటాయించాలని ఈ విషయమై ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 13 కులాల అధ్యక్షులు మోహన్ చవాన్, జాదవ్‌శరత్, ప్రవీణ్, భీమాజీ సాలుంకి, హీరలాల్ పవర్ తదితరులు పాల్గొన్నారు.

రెండో విడుతపై ఆశలు

- ఎమ్మెల్యే ప్రకటనతో దళితబంధుకు దరఖాస్తులు
- నియోజకవర్గానికి 1100 యూనిట్ల మంజూరు లక్ష్యం
- మంజూరు కోసం నాయకులకు పెరుగుతున్న లబ్దిదారుల తాకిడి

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభివృద్ధికి వారి సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన దళిత బంధు పథకం సంచలనంగా మారింది. ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఏకంగా దళిత కుటుంబాలకు 10 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేయడం దేశంలోనే ఇతర ప్రభుత్వాలు ఆలోచించే విధంగా మారింది. మొదటి విడతలో ప్రయోగాత్మకంగా మంజూరు చేసిన దళిత బంధు యూనిట్‌లు జిల్లాలో సత్ఫలితాలు ఇచ్చాయి. గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసే రుణాలు సక్రమంగా వినియోగంలోకి వచ్చేవి కావు, నామమాత్రంగా యూనిట్లు పొందినవారు నామ్ కే వాస్తేగా యూనిట్లు చూపించి నిధులు పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు ఎన్నో ఉన్నాయి. అలా కాకుండా ఒక దళిత కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెంది జీవితంలో స్థిరపడాలంటే వారికి సంపూర్ణంగా ఆర్థిక సహాయం చేస్తేనే వారు త్వరగా వ్యాపారవేత్తలుగా స్థిరపడే అవకాశం ఉందని భావించి ముఖ్యమంత్రి కేసీఆర్ దళిత బంధు పథకం తీసుకొచ్చారు.

మొదటి సారీ గ్రామానికి ఒకటి రెండు చొప్పున మంజూరయ్యాయి. వాటిని పొందిన లబ్దిదారులు ఉపాధి కోసం ట్రాక్టర్లు, కార్లు, వ్యాన్ లు, హార్వెస్టర్లు పొంది తదితర రంగాలకు సంబంధించిన వాటిలో స్థిరపడ్డారు.



మొదటి విడత పూర్తి అయి నెలలు గడుస్తున్నా రెండో విడత కోసం దళిత బంధు లబ్దిదారుల ఎంపికలో ఎలాంటి చలనం లేకుండా పోవడంతో దళితులు ఆందోళన చెందుతున్నారు.

త్వరలో రెండో విడత దళిత బంధు..

రానున్న రెండు మూడు రోజులలో రెండో విడత దళిత బంధు కార్యక్రమం ప్రారంభిస్తామని అందుకు అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ గురువారం బోధన్ పట్టణంలో నిర్వహించిన సభలో ప్రకటించడంతో రెండో విడత దళిత బంధు పై దళితులకు ఆశలు చిగురించాయి. మొదటి విడతలో తాము దళిత బంధువును పొందలేక పోయా మని ఈసారైనా దళిత బందులో లబ్ది పొందాలని గత కొన్ని నెలలుగా ఆశవా హులు ఎదురుచూస్తున్నారు. ఎమ్మెల్యే షకీల్ అమీర్ ప్రకటనతో వారిలో మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది. ప్రస్తుతం ఎన్నికల సీజన్ కావడంతో ప్రభుత్వం సైతం రెండో విడత దళిత బందును లబ్ధిదారులకు ఎంపిక చేసి త్వరగా అందించాలని లక్ష్యంతో ఉంది. అందులో భాగంగా రానున్న ఎన్నికల నోటిఫికేషన్ ముందుగానే రెండో విడత లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టడం వారికి యూనిట్లు మంజూరు చేయడం చకచక జరిగి పోయే అవకాశం ఉంది. దాంతో ఆశవాహులో దళిత బంధు జాబితాలో తమ పేరు ఉండడానికి నాయకుల వెంట తిరుగుతున్నారు. పలుచోట్ల చోట మోట లీడర్లు దళిత బంధు ఇప్పిస్తామని ఆశావాహులను నమ్మిస్తున్నట్లు సమాచారం. దళిత బంధు యూనిట్ల మంజూరిలో ఎలాంటి అక్రమాలు లేకుండా నిష్పక్షపాతంగా మంజూరు చేస్తామని ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ గతంలో హెచ్చరించారు.

నిజామాబాద్ జిల్లాలో 6050 మంది లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. వారికి మంజూరైన యూనిట్లకు 605 కోట్ల నిధుల రూపాయలను ప్రభుత్వం అందించే అవకాశం ఉంది. ఏదేమైనా బోధన్ నియోజకవర్గంలో రెండో విడత దళిత బంధు కోసం ఆశావాహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఎన్నికల సీజన్ కావడం రెండో విడత దళిత బంధు మజూరు చేయడం అనేది నాయకులకు ఎంపిక ప్రక్రియ కత్తి మీద సాముల మారింది. దాంతో వీలైనంత ఎక్కువ మదికి ఎలా సర్దుబాటు చేయాలో అంటూ నాయకులు తర్జనభర్జన పడుతున్నారు. రెండో విడత దళిత బంధు పథకం వరించే అదష్టం ఎవరెవరికి ఉందొ వేచి ఉండాల్సిందే.

నియోజకవర్గానికి 1100 యూనిట్ల మంజూరు లక్ష్యం

ప్రభుత్వం మొదటి విడత దళిత బందులో జరిగిన పొరపాట్లు పునరావతం కాకుండా సాధ్యమైనంత మంది అర్హులకు దళిత బంధు పథకం అందించాలని ఉద్దేశంతో నియోజకవర్గానికి 1100 యూనిట్లను మంజూరు చేసింది. అందులో భాగంగా మండలానికి కేటాయించే యూనిట్లను పరిగణలోకి తీసుకొని గ్రామాలకు కేటాయించే అవకాశం ఉంది. గతంలో కొన్ని గ్రామాలలో ఒకరిద్దరికి మాత్రమే దళిత బంధు అందడంతో చాలామందిలో నిరాశ ఆవరించింది. అలాంటి పొరపాట్లు కాకుండా ఎక్కువ మందికి దళిత బంధు పథకం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం భావిస్తుంది. ఉమ్మడి జిల్లాలో 9900 మందికి దళిత బంధు యూనిట్ల మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జీవో నెంబర్ 8 ప్రకారం లబ్దిదారులను ఎంపిక చేసి నిర్దేశిత పోర్టల్ లో నమోదు చేయనున్నారు. ఇప్పటికే అధికార పార్టీ నేతలు లబ్దిదారుల ఎంపికకు చర్యలు చేపడుతున్నారు. దీంతో గ్రామాలలో ఆశవాహుల సంఖ్య పెరుగుతూనే ఉంది. మొదటి విడత లబ్దిదారుల ఎంపికలో ఎమ్మెల్యే సమక్షంలో జరగడంతో విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రెండవ విడత ఎంపిక ప్రక్రియకు ప్రభుత్వం నియోజకవర్గాలకు ప్రత్యేక అధికారులను నియమించి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. వీరు గ్రామాల వారిగా దళితుల నుంచి దరఖాస్తు స్వీకరించి అర్హులను ఎంపిక చేస్తారు. గ్రామాలలో లబ్దిదారులను గుర్తించి ఆయా జాబితాను కలెక్టర్ కు పంపగానే ఆయన జిల్లా మంత్రికి పంపనున్నారు. అనంతరం జాబితాలో లబ్దిదారుల వివరాలను నిర్దేశిత దళిత బంధు పోర్టల్ లో నమోదు చేసి యూనిట్ల గుర్తింపు ప్రక్రియను ప్రారంభిస్తారు. ఈనెల మొదటి వారం లోపు లబ్దిదారుల గుర్తింపుతో పాటు యూనిట్లు ఎంపికను పూర్తి చేయడానికి ప్రభుత్వం కసరత్తులు ప్రారంభించింది. రెండో విడత దళిత బంధు కార్యక్రమంలో నియోజకవర్గానికి 1100 యూనిట్ల మంజూరు కోసం అవసరమైన నిధులు కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. లబ్దిదారులకు యూనిట్ల గ్రౌండింగ్ పూర్తికాగానే కలెక్టర్ ఖాతా నుంచి నేరుగా లబ్దరిని ఖాతాకు నిధులు జమ చేయనున్నారు.

ఏకగ్రీవ తీర్మానాలపై ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయొద్దు : మాజీ మంత్రి షబ్బీర్‌అలీ



రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న షబ్బీర్‌అలీ

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

ఎన్నికల్లో పోటీ పడే అభ్యర్థిని గెలిపిస్తామని గ్రామపంచాయతీ ఏకగ్రీవ తీర్మానం చేయడం చట్ట విరుద్ధమని, తీర్మానం చేసిన సర్పంచ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని, ఇలాంటి తీర్మానాలపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ డిమాండ్ చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే ఈ చర్యను వ్యతిరేకించే బదులు ఫీడ్ చేసి ట్విట్ చేసి ఇది చాలా సంతోషకరమైన విషయం అనడం ఎమ్మెల్సీ కవిత తెలివితక్కువ తనానికి నిదర్శనమని మండిపడ్డారు. కామారెడ్డి ఎన్నికల ప్రక్రియలో సీఎం కేసీఆర్ అవకతవకలకు పాల్పడ్డారని కేసీఆర్‌కు అనుకూలంగా గ్రామపంచాయతీ తీర్మానాలు చేసి ప్రజల హక్కును హరిస్తున్నారని వారి ఓటు హక్కుకు భంగం కల్పిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కాయితీ లంబాడాలను ఎస్టీలో చేర్చాలి



నినాదాలు చేస్తున్న కాయితీ లంబాడాలు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ గాంధారిలో నిర్వహించిన సమావే శానికి పెద్దకొడప్‌గల్ నుంచి పలువురు నాయకులు శు క్రవారం పెద్దకొడప్‌గల్ నుంచి తరలివెళ్లారు. ఈ సందర్భంగా సమాజ్ యూత్ ప్రెసిడెంట్ రాజేందర్ మాట్లాడుతూ లంబాడా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాన్సింగ్ నాయక్ ఆదేశాల మేరకు చలో గాంధారి ఏక్తా ర్యాలీ కార్యక్రమం చేపట్టామన్నారు. చెల్లప్ప కమిషన్ ఆధారంగా కాయతీ లంబాడీలకు వాల్మీకి బోయ వారితో కలిపి 10 శాతం రిజర్వేషన్లను ఇచ్చేందుకు కేంద్రానికి నివేదించి నట్లు తెలిపారు. ఎస్టీ జాబితాలో చేర్చడంతో పాటు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు రాజేందర్ బామాన్, ఉప అధ్యక్షుడు నరేష్,సోషల్ మీడియా కన్వీనర్.యూత్ కమిటీ సభ్యులు బచ్చన్ పడవల్ జైత్రమ్, కానీరం, సర్పంచ్ ననక్ సింగ్, జైత్రమ్, మాజీ సర్పంచ్ బన్సీ, ఇంధల్ నాయక్ ,కుమార్, సాబ్లే సురేందర్. గోతి శ్రీ రాం, అశోక్, సాబ్లే రవీందర్, జేతిలాల్ ప్రతి తాండ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ టెస్ట్‌కు 14 సెంటర్‌లు

- విరివిగా పరీక్షలు : డీఎంఅండ్‌హెచ్‌వో

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంపూర్ణ సురక్ష హెచ్‌ఐవి ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం రెండవ పేజ్ లో భాగంగా ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవి స్థితి తెలుసుకోవడం కోసం జిల్లా వ్యాప్తంగా హెచ్‌ఐవి పరీక్షల కోసం 14 సెంటర్లను ఏర్పాటు చేసినట్టు జిల్లా వైద్యాధికారి సుదర్శనం తెలిపారు. ఈ నెల నుంచి వచ్చే ఫిబ్రవరి వరకు పరీక్షలు చేసి పాజిటివ్ వ్యక్తులను గుర్తించి చికిత్సను అందించిను న్నట్టు తెలిపారు.

దీంట్లో భాగంగా శుక్రవారం స్థానిక జిల్లా ఆసుపత్రి బోధన్ లోని ఐసిటిసి సెంటర్ లో సంపూర్ణ సురక్ష హెచ్‌ఐవి ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం ఫేజ్ 2 ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సుదర్శనం ప్రారం భించి మాట్లాడారు. జాతీయ ఎయిడ్స్ నివారణ సంస్థ నిర్దేశిం చిన లక్ష్యం ప్రకారం జిల్లాలో 2021 జనాభా ప్రకారం 0.461 ప్రివ లెన్స్‌తో 6274 మంది కి హెచ్‌ఐవి సోకి ఉండవ చ్చని ఒక అంచనా ఇచ్చినట్టు తెలిపారు. ఈ లెక్క ప్రకారం వారిలో 95 శాతం మందికి వారి హెచ్‌ఐవి స్థితి తెలిసి ఉండాలి అనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిం చినట్టు తెలిపారు. ఇప్పటి వరకు మన జిల్లా లో ఉన్న గణాంకాలను చూస్తే 6091 మందిని గుర్తించామని, దీనికి గాను రాష్ట్ర స్థాయి లో మొదటి స్థానంలో నిజామాబాద్ ఉండటం గర్వంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారుల తో పాటు టీబి కోఆర్డినేటర్ రవి టీబి అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఐవీ స్థితి తెలుసుకునేందుకు ఏర్పాటు చేసి సెంటర్‌ను ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో

15న టెట్ పరీక్ష

- 64 కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు : అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈ నెల 15న నిర్వహించనున్న టెట్-2023 (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమావేశమై పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 15 న టెట్ పరీక్ష కొనసాగనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఉదయం 9:30 గంటల నుండి 12:00 గంటల వరకు మొదటి సెషన్ లో జరిగే పేపర్-1 పరీక్షకు జిల్లాలో 15,263 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా 64 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. అలాగే, రెండవ సెషన్‌లో మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జరిగే పేపర్-2 పరీక్షకు 11,573 హాజరు కానుండగా, 50 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. టెట్ పరీక్షకు సంబంధించి అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ : 9030282993 ను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్.వి.దుర్గాప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రఘునందన్‌రావును అడ్డుకున్న పోలీసులు

- రెండు గంటల పాటు రోడ్డుపై వాగ్వాదం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్/బిచ్కుంద

చలో గజ్వేల్ పిలుపు నేపథ్యంలో బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి బిచ్కుంద పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే ఆయనను కలిసేందుకు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు బిచ్కుందకు వచ్చే ప్రయత్నం చేయగా.. పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో పోలీసులు అడ్డుకున్నారు. సుమారు రెండు గంటల పాటు పోలీసు లకు, బీజేపీ నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అంతకుముందు పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రఘునందన్‌రావు మాట్లాడారు. సీఎం కేసీఆర్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చూసేందుకు ప్రజాస్వామ్యబంద్ధంగా వెళ్లేందుకు సిద్ధపడ్డ నాయకులను కామారెడ్డి జిల్లా పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి గురువారం సాయంత్రం బీజేపీ నాయకుడు జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ వెంకటరమణ రెడ్డిని కొంతమంది కార్యకర్తల అరెస్ట్ చేసి అన్ని పోలీస్‌స్టేషన్‌లలో తిప్పారని అన్నారు. రాత్రి మూడు గంటల సమయానికి బిచ్కుంద పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారని తెలిపారు. డిస్క్ క్వాలిఫికేషన్ పిటిషన్ మీద వచ్చినటువంటి జడ్జిమెంట్‌ను స్పీకర్‌కు అందించి నేరుగా బిచ్కుంద బయలుదేరిన క్రమంలో పెద్దకొడప్‌గల్‌లో పోలీసులు అడ్డుకున్నట్టు తెలిపారు. ఏ చట్టం ప్రకారం 24 గంటలు పోలీసు ఆధీనంలో ఉంచుకుంటారని ప్రశ్నించారు. ఉన్నతాధికారులతో చర్చించిన అనంతరం వెంకటరమణారెడ్డిని పోలీసులు విడుదల చేశారు. పోలీసులు బీఆర్ఎస్ ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. అతని వెంట బాన్సువాడ ఇంచార్జ్ మల్యాద్రిరెడ్డి, కామారెడ్డి జిల్లా ఇన్చార్జ్ బద్దం మైపాల్ రెడ్డి,పెద్దకొడప్ గల్ పార్టీ మండల అధ్యక్షుడు బాలాజీ పటేల్, బిచ్కుంద బీజేవైఎం మండల అధ్యక్షుడు విష్ణు, పిట్లం పార్టీ మండల అధ్యక్షులు అభినయ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టేషన్ ఎదుట కార్యకర్తల ఆందోళన

బిచ్కుంద : వెంకటరమణరెడ్డిని అరెస్ట్ చేసి బిచ్కుంద పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతో భాజపా నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్ కు తరలి వచ్చి నిరసన చేపట్టారు. పార్టీ మండల యువ మోర్చా నాయకులు విష్ణు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ లో అభివృద్ధి చేస్తే అక్కడ జరిగిన అభివృద్ధి చూడ్డానికి బీజేపీ నాయకులు వెళ్లేందుకు సిద్ధపడితే ఎందుకు అరెస్ట్ చేస్తున్నారని ప్రశ్నించారు.

పోచారం శ్రీనివాస్‌కే మా మద్దతు

- తండాలను పంచాయతీగా మార్చి అభివృద్ధి : జేకే, కోనాపూర్ గ్రామస్తులు

నవతెలంగాణ-బాన్సువాడ

తండాలను పంచాయతీలుగా మార్చి, అభివృద్ధి పనులు చేపట్టి గ్రామాల్లో సకల సౌకర్యాలు కల్పించిన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికే తమ మద్దతు అని బాన్సువాడ మండలంలోని జేకే తండా వాసులు, కోనాపూర్ గ్రామస్తులు తెలిపారు. బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ అభ్యర్థిగా పోచారం శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ ఖరారు కావడంతో శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి తమ మద్దతు తెలిపారు. తమ తాండాను గ్రామ పంచాయతీ గా ఏర్పాటు చేయడంతో పాటుగా తాండా వాసులకు అవసరమైన అన్ని రకాల పనుల కోసం కోట్ల రూపాయలు మంజూరు చేసినందుకు కతజ్ఞతగా పోచారం శ్రీనివాసరెడ్డి గారికి ఏకగ్రీవంగా మద్దతు తెలుపుతూ తాండా వాసులు అందరూ కలిసి చేసిన తీర్మానం కాపీని అందజేశారు. స్పీకర్‌ను కలిసిన వారిలో జేకే తాండా పెద్దలు సంగ్యా నాయక్, జమ్లా కార్బారీ, బన్సిలాల్, జగ్రామ్, మూడ్ బన్సీ, సురేష్, రూప్ సింగ్, కోనాపూర్ గ్రామం నుండి సర్పంచ్ రమణారావు, ఎంపీటీసీ హనుమాండ్లు, గ్రామ శాఖ అధ్యక్షుడు రాజు, ఉప సర్పంచ్ సాయిలు, పూదరి లక్ష్మణ్, గూళ్ళ సాయిలు, నోరి గంగారాం తదితరులున్నారు.



మద్దతు తెలియజేస్తున్న పలువురు

ఫైన్ రాసి వదిలేయబోం.. చట్టప్రకారం చర్యలు

- వాహనాల తనఖీ చేపట్టిన ట్రాఫిక్ పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ట్రాఫిక్ పోలీసులే కదా ఏమంటారు.. చూస్తారు.. ఫైన్ రాస్తారు.. వదిలేస్తారు...అని అనుకుంటున్నారు కానీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చట్టప్రకారంగా అన్ని చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని ట్రాఫిక్ సీఐ చందర్‌రాథోడ్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ టీ జంక్షన్, చంద్రశేఖర్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం ఒక్కసారిగా ట్రాఫిక్ ఫోర్స్‌తో వాహనాలను తనిఖీలు చేశారు. వాహనాలకు నెంబర్ ప్లేట్స్ లేకుండా ఉన్న వాహనాలను ఆపి జరిమానా విధించి తప్పనిసరిగా వాహనానికి నెంబర్ ప్లేట్ పెట్టాలని లేకుంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఒక్కసారిగా అంతా ఫోర్స్ అక్కడ దిగేసరికి ఆర్ఐ, ఆర్ఎస్ఐ ఎస్ఐ ట్రాఫిక్ సిబ్బంది అందరూ రావడంతో ప్రజలు అవాక్కయ్యారు.



వాహనదారులకు సూచనలిస్తున్న ట్రాఫిక్ సీఐ

తెలంగాణ జాగృతి ఖతర్ ఆధ్వర్యంలో రాఖీ సంబరాలు



నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణా జాగృతి ఖతర్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ పండుగ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఎన్ఆర్ఐ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఎన్ఆర్ఐ ఉపాధ్యక్షులు గురాయి రాజేందర్, ఎన్ఆర్ఐ సభ్యులు బీసీ ఎన్ఆర్ఐ సభ్యులు పాల్గొన్నారు. సోదరి, సోదరుల మధ్య గల ప్రేమానురాగాలను పంచుకొని సంబరాలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్నందుకు తెలంగాణా బీసీ సంక్షేమ సంఘం ఎన్ఆర్ఐ అధ్యక్షులు బట్టు స్వామి, ఖతార్ టీమ్‌ను అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఆర్మూర్ ప్రాంత వాసులు

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లా నుండి 30 మంది ఉపాధ్యాయులు ఎంపిక కాగా ఇందులో ఆరుగురు పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో పనిచేసే ఉపాధ్యాయులే ఉన్నారు. వీరు ఈనెల 5న ఉత్తమ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సత్కారం పొందనున్నారు. పట్టణంలోని ఎంపిపిఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, మండలంలోని మంతిని పాఠశాల ఉపాధ్యాయులు నాగరాజు, మచ్చర్ల పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, సుర్బిర్యాల ఉపాధ్యాయులు అరుణ్ కుమార్, అంకాపూర్ బీసీ కాలనీ పాఠశాల ఉపాధ్యాయులు సంతోష్, గోవింద్‌పేట్ ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయురాలు పద్మావతి ఎంపికయ్యారు. వేల్పూర్ మండలంలోని పడిగేల ఉన్నత పాఠశాల వ్యాయమా ఉపాధ్యాయులు మంచిర్యాల సురేష్ కుమార్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు.

కస్తూర్బాలో పోషకాహార వారోత్సవాలు



పోషకాహారం గురించి వివరిస్తున్న అధికారి

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం పోషకాహార వారోత్సవాలను జిల్లా అధికారులు శుక్రవారం నిర్వహించారు. ఇందులో మాంసకృత్తులు, పిండి పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు విద్యార్థులకు ఏ విధంగా ఉపయోగపడతాయి.. ఎంత మోతాదులో తీసుకోవాలి.. అనే అంశాలను చర్చించారు. కార్యక్రమంలో పోషణ అభియాన్ కోఆర్డినేటర్ రాంబాబు, మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారులు స్వప్న, సౌమ్య, ఏసీడీపీఓ జ్ఞానేశ్వరి, అంగన్వాడీ టీచర్లు, కస్తూర్బా టీచర్లు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

నవతెలంగాణ-ముప్కాల్

నిజామాబాద్ పోలీస్ కళాబృందం' ఆధ్వర్యంలో ముప్కాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఐ భాస్కరా చారి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళా సంరక్షణ కోసం సూచనలను అందించారు. మహిళల భద్రత కోసం నిజామాబాద్ షీ టీమ్ రక్షణ కల్పిస్తుందని అన్నారు. మహిళలు తమ రక్షణకై జిల్లా షీటీం 8712659795 లేదా డయల్ 100 కి ఫోన్ చేయాలని సూచించారు. నిత్యం వాడే సెల్ పోయిన, దొంగిలించిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేయవచ్చని తెలిపారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై సురేష్, జిల్లా కళాబృందం సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు గుండోజి నరేంధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

- వివోఏల వేతనాల పెంపు పట్ల సెర్ప్ ఉద్యోగ సంఘాల జేఏసీ హర్షం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఐకెపిలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న గ్రామ సమాఖ్య సహాయకులు వివోఏల వేతనం రూ.5వేల 9 వందల నుండి రూ.8వేలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 442 ను జారీ చేసిన సందర్భంగా తెలంగాణ సెర్ప్ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుంట గంగాధర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాఖీ పౌర్ణిమ కానుకగా మహిళా సంఘాల కోసం పనిచేస్తున్న వివోఏల వేతనాల పెంపు పట్ల సెర్ప్ ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ తోనే ఉద్యోగులకు, కార్మికులకు అన్ని వర్గాలకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని ఈ సంఘటనతో మరోమారు రుజువైందని పునరుద్ఘాటించారు. సీఎం కేసీఆర్ వల్లనే సెర్ప్ ఉద్యోగులకు పేస్కేలు వర్తింప చేస్తూ జీవో నెంబర్ 11 ఇదివరకే విడుదల చేశారని గుర్తు చేశారు. ఇందుకు కృషిచేసిన ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావుకు, గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తాన్యాకు, సెర్ప్ సీఈవో గౌతం పొట్రు లకు సెర్ప్ ఉద్యోగ సంఘాల స్టేట్ జేఏసీ నాయకుల తరపున గంగారెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

తెలుగు అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-భీంగల్

పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు సబ్జెక్టు బోధించేందుకు అధ్యాపకుని నుండి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సతీష్ తెలిపారు ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పీజీలో 55 శాతం కలిగి ఉండి నెట్, సెట్, పీహెచ్‌డీ గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈనెల 6ను తమ బయోడేటాలను కళాశాలలో అందించాలని పేర్కొన్నారు. 9848581970 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

మామిడిపల్లిలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ



జెండాఆవిష్కరిస్తున్న మానాల మోహన్‌రెడ్డి

నవతెలంగాణ - మాక్లూర్

మండలంలోని మామిడిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను జిల్లా అధ్యక్షులు మనాల మోహన్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండాను అవిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రవి ప్రకాష్, మాజీ మండల అధ్యక్షులు వెంకటేశ్వర్ రావు, జిల్లా నాయకులు గంగాధర్ గౌడ్, దేగ పోశెట్టి, పీర్ సింగ్, మైనరి అధ్యక్షులు హలీం, పురుషోత్తం, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

- నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన
- తహసీల్దార్లకు వినతి

సెప్టెంబర్ ఒకటి పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా సీపీఎస్‌ను రద్దుచేయాలని ఉపాధ్యాయులు శుక్రవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. భోజన విరామ సమయంలో నల్లబ్యాడీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు.



నిజామాబాద్: మోపాల్ ఉన్నత పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



బాల్కొండ: వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు



భీంగల్: నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-విలేకరులు

వేల్పూర్: సీపీఎస్‌ని రద్దు చేయాలని పిఆర్‌టీయూ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గంట అశోక్, అంకం నరేష్ అన్నారు. భోజన విరామ సమయంలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని మండల పిఆర్టియు ఆధ్వర్యంలో మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తూ ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని అన్ని పాఠశాల ఉపాధ్యాయులు సిపిఎస్ విద్రోహ దినాన్ని పాటిస్తూ నల్ల బ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారని వారు తెలిపారు. అన్ని ప్రధాన పార్టీలు మేనిఫెస్టోలలో సిపిఎస్ రద్దు అంశాన్ని చేర్చాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కాంతయ్య, నరసింహారావు ఉపాధ్యక్షులు దశంధర్, వినయ్ కుమార్ విజయ్ కుమార్ రవీందర్, మండల అసోసియేట్ అధ్యక్షులు సుధీర్ కుమార్, మండల మహిళా ఉపాధ్యక్షురాలు శైలజ ఉపాధ్యాయులు శ్రీనివాస్ ఓంకార్ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి : ప్రభుత్వం కొత్తగా తెచ్చిన సిపిఎస్ విధానాన్ని గోలగించాలని కోరుతూ శుక్రవారం ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణతో కలిసి పలువురు ఉపాధ్యాయులు తహసీల్దార్ మాలతికి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం వల్ల ప్రభుత్వ ఉద్యోగులకు నష్టం చేకూరే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ఉద్యోగుల పట్ల ఉదారస్వభావంతో విధానాన్ని తొలగించి ఓపిఎస్ విధానాన్ని అమలు పర్చాలని కోరారు. ప్రతి ఉద్యోగులకు పెన్షన్ పొందడమనేది హక్కు, అలాంటి హక్కును హరించేవిధంగా దిగుబండగా మారిన సిపిఎస్ విధానాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రామానుజ చారి, మహిళా కార్యదర్శి కళ్యాణి, సత్యం, గీత, సరిత, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండల కేంద్రంలో పీఆర్టియూ టీఎస్ ఏర్గట్ల మండల శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 సందర్భంగా పెన్షన్ విద్రోహ దినం నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న ఈ కాంట్రిబ్యూటరి పెన్షన్ విధానం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు భవిష్యత్తుకు భద్రత లేకుండా పోతుందని, తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమం దృష్ట్యా సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ ఇప్పించాలని కోరుతూ పీఆర్టియూ టీఎస్ మండల శాఖ పక్షాన ఉపాధ్యాయులు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్.ఐ సదానందంకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమం లో పీఆర్టియూ మండల అధ్యక్షులు శేర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, ప్రసాద్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బిజ్జి గోపి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గటడి భాస్కర్, సుధాకర్, మండల నాయకులు పవన్, సురేష్ ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు సూర్య ప్రకాష్, శ్రీధర్, గిరిధర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్కొండ:: సిపిఎస్ పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాల ఉపాధ్యాయులు సీపీఎస్ అంతం పీఆర్‌టీయూ పంతం నినాదంతో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతర తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఆడప శ్రీధర్ కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రతాపరెడ్డి ,స్టేట్ అసోసియేట్ అధ్యక్షుడు జి నర్సారెడ్డి, జి గంగాధర్, ఉపాధ్యక్షుడు ప్రశాంత్, రామ్ కిషన్, రామస్వామి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు లక్ష్మణ్, మండల అసోసియేట్ అధ్యక్షుడు కే రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సిపిఎస్ విద్రోహ దినం సందర్భంగా నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగా నర్సయ్య, ఏకనాథ్, శ్రీనివాస్, కవిత, మల్లేష్, పాల్గొన్నారు.

మోపాల్: మంచిప్ప ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శోభ, మంచిప్ప ఉపసర్పంచ్ జగదీష్‌తో కలిసి సిపిఎస్ విద్రోహ దినం సందర్భంగా ఎమ్మార్వో వినతిపత్రం అందజేవారు. శోభ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ లోకి తీసుకురావాలని కోరారు.

నిజామాబాద్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో సిపిఎస్ ను రద్దు చేయాలని మోపాల్ మండలకేంద్రం లోని ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉన్నతి శిక్షణ కార్యక్రమంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టు బద్రీనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే కాంట్రిబ్యూషన్ పెన్షన్(సిపిఎస్) విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపుప్రధాన కార్యదర్శి పాప రామకృష్ణారెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు యార్లగడ్డ రాఘవేందర్, డివిజన్ కార్యదర్శి డింగిరి మధుసూదన్, జిల్లా బాధ్యులు నరోత్తం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్‌ను వెంటనే రద్దుచేసీ ఓపీఎస్‌ను పునరుద్ధరించాలనీ జాక్టో చైర్మన్ ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2004 సెప్టెంబర్1 తర్వాత ఉద్యోగంలో చేరిన వారికి పెన్షన్ ఇవ్వకపోవడం శోచనీయమని అన్నారు. పెన్షన్ ప్రభుత్వ ఉద్యోగుల హక్కు అని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసినదృష్ట్యా వెంటనే ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. బ్లాక్ రిబ్బన్ తో నిరసన తెలిపారు. కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి ద్వారా కలెక్టర్ వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ ప్రధాన కార్యదర్శి ధర్మేందర్, జాక్టో కో చైర్మన్ సుశీల్ కుమార్, జిల్లా అధ్యక్షులు రాంచందర్ గైక్వాడ్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మోతేసాయన్న, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పిఆర్ టియుటిఎస్ కమ్మర్ పల్లి మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పెన్షన్ విద్రోహ దినం నిర్వహించారు. మండల అధ్యక్షులు పొద్దుటూరి చంద్రశేఖర్ మాట్లాడుతూ.... ప్రస్తుతం ఉన్న కాంట్రిబ్యూటరి పెన్షన్ విధానం వలన ఉద్యోగ, ఉపాధ్యాయులకు భవిష్యత్తు భద్రత లేకుండా తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎస్ విధానం పూర్తిగా స్టాక్ మార్కెట్ లావా దేవిలపైన ఆధారపడి ఉందని, దీనిని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు సిపిఎస్ ని రద్దు చేశాయని, ముఖ్యమంత్రి కేసిఆర్ కూడా ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమం దృష్ట్యా సీపీస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ ని ఇప్పించాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రమేష్ కు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అంజాద్ సుల్తాన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బాలరాజు, మండల కార్యదర్శి రోహిత్, సభ్యులు కోల రాజేశ్వర్, సుమలత, సరిత, సంతోష్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

భీంగల్: మండలంలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సాయంత్రం బైక్ ల మీద ర్యాలీగా వెళ్లి భీంగల్ మండల తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయు మండల అధ్యక్షులు యం.వాసుదేవ్, ప్రధాన కార్యదర్శి రాస దయాకర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వి.లక్ష్మీ నారాయణ, యం.ప్రభాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్.చంద్ర దేవ్, రాష్ట్ర కార్యదర్శి యం.శ్రీనివాస్, మండల కార్యదర్శి డి.రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏర్గట్లలో..



ధర్పల్లి : వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు



కమ్మర్‌పల్లి : వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు



ముప్కాల్‌లో..



నిజామాబాద్‌సిటీ :వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు



వేల్పూర్‌లో..

చేప పిల్లల విడుదల



చేపపిల్లలు విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-బాల్కొండ

సమీకృత మత్స్య అభివృద్ధి పథకం ఐఎఫ్‌డీఎస్ ద్వారా 100శాతం రాయితీపై మండల కేంద్రంలోని చెరువులో మొదటి విడతగా 33,180 చేపపిల్లలను సర్పంచ్ బుస సునీత, ఎంపీడీవో సంతోష్ కుమార్, ప్రజా ప్రతినిధులతో కలిసి శుక్రవారం విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి ఈ కార్యక్రమం చేపడుతున్నందున, మత్స్యకారులు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాల్కొండ జడ్పిటిసి దాసరి లావణ్య వెంకటేష్, ఉప సర్పంచ్ షేక్ వాహబ్, ఎంపీటీసీ కన్నా లింగవ్వ పోశెట్టి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఫయాజ్ అలీ, పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్, మత్స్యకార సంఘం అధ్యక్షుడు బట్టు ప్రవీణ్, కార్యదర్శి గణేష్, ఉపాధ్యక్షుడు బలరాం పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో 'మట్టికథ' బృందం సందడి



చిత్ర యూనిట్ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని క్షత్రియ కళాశాలలో మట్టికథ సినిమా యూనిట్ బృందం శుక్రవారం సందడి చేసింది. పట్టణంలోని క్షత్రియ ఇంటర్మీడియట్ కాలేజ్‌లో కళాశాల యాజమాన్యం ఏర్పాటుచేసిన మట్టికథ సినిమా యూనిట్ కు అభినందన సభా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన క్షత్రియ కళాశాల కరస్పాండెంట్ అల్జాపూర్ దేవేందర్ మాట్లాడుతూ తెలంగాణ యువకులు తెలంగాణ పల్లె కథాంశంగా చిత్రాన్ని రూపొందించి 9 అవార్డులు కైవసం చేసుకోవడం తెలంగాణకే గర్వ కారణం అని అన్నారు. యువత తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకొని లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆత్మస్థైర్యంతో కృషి చేస్తే అసాధ్యం ఏది కాదని ఈ యువకులు నిరూపించారని తెలిపారు. మట్టికథ సినిమాకు తెలంగాణలో మంచి ఆదరణ లభిస్తుందని ఆయన ఆకాంక్షించారు. మట్టి కథ సినిమా దర్శకుడు పవన్ కడియాల మాట్లాడుతూ తెలంగాణ పల్లె జీవన విధానాన్ని కథాంశంగా తెరకెక్కించిన ఈ సినిమా తెలంగాణ ప్రజల మనసులను దోచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే మట్టి కథ సినిమా థియేటర్లలో విడుదల కానున్నదని అందరూ సినిమా చూసి ఆదరించాలని కోరారు. మమ్మనీతం తమిళ సినిమాలో హీరో విజయ్ సేతుపతి మరియు బలగం సినిమాలో హీరో ప్రియదర్శి సాధించిన ఇండో ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డును మట్టి కథ సినిమా హీరో అజయ్ వేద్ కైవసం చేసుకొని వారి సరసన చేరడం గర్వంగా ఉందన్నారు. ఈ అవార్డులతో పాటు మట్టి కథ సినిమా కోలీవుడ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, తమిజగం ఇంటర్నేషనల్ ఫెస్టివల్ అవార్డులు మొత్తంగా తొమ్మిది అవార్డులు కైవసం చేసుకుందని అన్నారు. కథానాయకుడు అజయ్ వేద్ మాటలకు విద్యార్థిని విద్యార్థులు కేరింతలు కొడుతూ పాటలకు కథానాయకుడితో కలిసి స్టెప్పులు వేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్, కళాకారుడు కోకిల నాగరాజు, మట్టికథ చిత్రం యూనిట్ సభ్యులు శ్రీనివాసరావు రుచిత అక్షయ్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
కామారెడ్డి
శనివారం | సెప్టెంబర్ 02, 2023 | www.navatelangana.com

పోలీస్ స్టేషన్ ముందు ధర్నా



నవతెలంగాణ-రామారెడ్డి

గజ్వేల్ నియోజకవర్గ సందర్శన కోసం బిజెపి పిలుపునిచ్చిన నేపథ్యంలో, కామారెడ్డితో పాటు రామారెడ్డి మండల బిజెపి నాయకులను అరెస్టు చేసి శుక్రవారం రామారెడ్డి పోలీస్‌స్టేషన్‌కు పోలీసులు తరలించారు. బిజెపి నాయకులు పోలీస్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో కామారెడ్డి కౌన్సిలర్లు కాసర్ల శ్రీనివాస్, అవధూత నరేందర్, మోహన్‌రెడ్డి, తదితరులున్నారు.

మేనూర్ పశువైద్యాధికారిగా సంతోష్ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని మేనూర్ ప్రైమరీ వెటర్నరీ సెంటర్లో డాక్టర్ సంతోష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన డాక్టర్ విజయకుమార్‌ను సంబంధిత అధికారులు డిప్యూటేషన్‌పై బీర్కూరు మండలం రైతునగర్ గ్రామానికి బదిలీ చేశారు.

చేనేత వస్త్ర తయారీతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

నవతెలంగాణ-దోమకొండ

చేనేత వస్త్ర తయారీతో మహిళలు స్వయం ఉపాధి పొందాలని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్, రాష్ట్ర చేనేత సొసైటీ డైరెక్టర్ పూగలంతి అన్నారు. దోమకొండ మండల కేంద్రంలోని ఆనంద్ భవన్‌లో గడి కోట ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర తయారీ శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం చేనేత వస్త్ర పరిశ్రమను కాపాడడానికి, భవితరాలకు అందించడానికి అభివృద్ధికి కృషి చేస్తుందని, ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా చేనేత వస్త్ర తయారీ శిక్షణను ప్రవేశ పెట్టిందని మహిళలు, యువత సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా స్థిరపడాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో చేనేత వృత్తిలో మహిళల నైపుణ్యం వెలికితీసి 45 రోజుల పాటు, మహిళలకు శిక్షణ అందించి ఉపాధి అవకాశం కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి కృషి చేస్తుందని, చేనేత వస్త్ర తయారీ శిక్షణ కేంద్రంలో మహిళలు శిక్షణ పొందిన తరువాత వారికి 90 శాతం సబ్సిడీతో వస్త్ర తయారీ మగ్గం పనిముట్లు, యంత్రాలు అందజేస్తుందని, వస్త్ర తయారీలో భాగంగా వస్త్ర తయారీకి కలర్ ఎలా వేయాలనే దానిపై మహిళలకు శిక్షణ అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజలి, చేనేత ప్రోగ్రామ్ డిజైనర్ పవన్, కామారెడ్డి ఏడీ సంతోష్ కుమార్, గడికోట ట్రస్ట్ మేనేజర్ బాబ్జి, మహిళలు పాల్గొన్నారు.



చేనేత వస్త్ర తయారీ శిక్షణలో మహిళలకు ఫైల్స్‌ను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

వజ్రోత్సవాలకు తరలిన ఎంపీపీ, జడ్పీటీసీ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ఎంపీపీ గైని అనుసూయ, జడ్పీటీసీ కమిలి నర్సింలు శుక్రవారంవజ్రోత్సవాలకు బయలుదేరారు. హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతున్న స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపుకు వివిధ మండలాల జడ్పీటీసీ, ఎంపీపీలు, సదాశివనగర్ జడ్పీటీసీ, కోఆప్షన్ మెంబర్ తదితరులు హైదరాబాద్‌కు బయలు దేరారు.

ప్రిన్సిపాల్‌కు అదనపు బాధ్యతలు



కళాశాల వద్ద ప్రిన్సిపాల్, తదితరులు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని నూతనంగా మంజూరైన జూనియర్ కళాశాలలో పిట్లం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయనందరెడ్డి నిజాంసాగర్ ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయనందరెడ్డి మాట్లాడుతూ.. నిజాంసాగర్ మండలంలో నూతన కళాశాల మంజూరైందని, కావున ఇంటర్మీడియట్ కోర్సులలో అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. 2023-24 అకాడమీ సంవత్సరం సంబంధించి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులలో విద్యార్థిని విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవచ్చని ఆయన తెలిపాడు. వేరే కాలేజీలలో నిన్నటితో గడువు ముగిసిందని కానీ నిజాంసాగర్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవడానికి ఇంకా గడువు ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ మంచి అవకాశాన్ని విద్యార్థిని విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ విద్యాధికారి శ్రీషేక్ సలాం, ఉపాధ్యాయ బృందం ప్రొఫెసర్ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మేడపాటి ప్రకాష్ రెడ్డి జన్మదిన వేడుకలు



మేడపాటి బర్త్‌డే వేడుకల్లో నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

బీజేపీ సీనియర్ నాయకులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీజేపీ మండల పార్టీ కార్యాలయం ఆధ్వర్యంలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, యువకులు, నాయకులు ఘనంగా నిర్వహించారు. అంతకుముందుగా ప్రజాప్రతినిధులు మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రతిభ హాస్పటల్ నిజామాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో రోగులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అంతకుముందుగా పాఠశాలలోని బాలబాలికలకు ఆయన జన్మదిన పురస్కరించుకొని పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాటాపూర్ గేటు వద్ద అలాగే మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయం వద్ద మేడపాటి ప్రకాష్ రెడ్డి జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతిభ హాస్పటల్ వైద్యులు సిబ్బంది రోగులకు తమ వంతు సేవలను అందిస్తూ ఉచితంగా ఔషధాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిజెపి మండలాధ్యక్షులు, పోచారం సర్పంచ్ కోలా ఇంద్రకరణ్, జానకంపేట, జంలం, వడ్డేపల్లి, ఎడపల్లి ఆయా గ్రామాల బీజేపీ నాయకులు కార్యకర్తలు మేడపాటి ప్రకాష్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి వీవోఏల పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీవోఏలు

నవతెలంగాణ-బోధన్

ఇందిరా క్రాంతి పథం పథకంలో భాగంగా వీవోఏలుగా పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం రూ.8000ల వేతనాన్ని పెంచుతున్నట్లు ప్రకటించడంతో శుక్రవారం బోధన్ ఐకేపీ కార్యాలయంలో వీఓఏలు సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పోశెట్టి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వీఓఏలకు గతంలో ఇస్తున్న 3900 నుంచి 5000 వరకు పెంచారని, గ్రామ సంఘం నుంచి 2000 నుంచి 3000ల వరకు పెంచి ప్రస్తుతం నెలకు 8000లను సీఎం కేసీఆర్ తమ వేతనం పెంచారని తెలిపారు. అలాగే వీఓఏలకు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రకమైన యూనిఫారం అందించి, హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించిన సీఎంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బోధన్ మండల అధ్యక్షులు కే వెంకటేష్, రేఖ, నాగయ్య, రమేష్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగ ఎంతో ముఖ్యం



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రామారెడ్డి

మానవుని దైనందిన జీవితానికి యోగ ఎంతో మేలు చేస్తుందని రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థిని, అన్నారం గ్రామానికి చెందిన రామా విద్యార్థులకు సూచించారు. శుక్రవారం విద్యార్థులకు యోగాసనాలు వేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ జీవితానికి యోగ ముడిపడి ఉందని, యోగాతో ఏకాగ్రత పెంపొందించుకునే విధానం, ఒత్తిడిని ఎదుర్కొనే విధానం, భారతదేశంలో యోగ ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మధు శ్రీ వాత్సవ, అధ్యాపకులు రమేష్, సిద్దయ్య, తిరుపతి, అశోక్, రాజాగౌడ్, నాగేశ్వర బాబు, ప్రసాద్, వెంకట్‌రాజు, రాజు, కృష్ణవేణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వెలుగు నింపేదే దళిత బంధు

- ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

దళిత జీవితాల్లో వెలుగులు నింపేదే దళిత బంధు పథకమని ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అంజనీ గ్రామంలో దళిత బంధులో భాగంగా ఏర్పాటు చేసిన పౌల్ట్రీ ఫారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మహనీయులు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, జ్యోతిబాఫూలే బాబు, డాక్టర్ జగ్జీవన్‌రామ్ కన్న కలలను సాకారం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు దళితులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ప్రవేశపెట్టారన్నారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారని వివరించారు. దళిత బంధు పథకం ద్వారా ఒక్క రూపాయి కూడా బ్యాంకు లింకేజీ లేకుండా రూ.10లక్షలను నేరుగా వారి అకౌంట్లలో జమ చేసినట్టు తెలిపారు. దళితులు వారు కోరుకున్న రంగాల్లో ఎదిగేందుకు మంచి యూనిట్లను ఎంచుకొని ఆర్థిక సాధికారత సాధించాలన్నారు. దళిత బంధు పథకం ఎక్కడో ఉన్నా చుట్టాలను, బంధువులను ఆత్మీయంగా ఏకం చేసిందన్నారు. దళితులు దళితబంధును సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. దళిత బంధుతో దళితుల కన్న కలలు నిజమవుతాయని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామానికి ఐదు చొప్పున దళితబంధు పథకం వస్తుందని, వచ్చినవారు జల్సాలకు పాల్పడకుండా క్రమబద్ధంగా వ్యాపారాలు చేసుకొని సమాజంలో గౌరవంగా బతకాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, సొసైటీ చైర్మన్ హనుమంత్ రెడ్డి, బిచ్కుంద మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కందరావు పటేల్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, ఎంపీఓ సూర్యకాంత్, సొసైటీ డైరెక్టర్ సాయ గౌడ్, లబ్ధిదారుడు శివకుమార్, ఉప సర్పంచ్ లచ్చ గౌడ్, గ్రామపెద్దలు రంజిత్, అంజాగౌడ్, లక్ష్మా గౌడ్, బీఆర్ఎస్ యూత్ మండల ప్రెసిడెంట్ చిప్ప రమేష్, హనుమంత్ రెడ్డి, ప్రేమ్‌సింగ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పౌల్ట్రీఫారాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

స్వర్ణకారులకు చేయూతను అందించాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

స్వర్ణకారులకు చేయూతను అందించాలని ఎల్లారెడ్డి ఆర్డీవో సిబ్బందికి స్వర్ణకారులు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్వర్ణకారులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత చేతివృత్తులకు మళ్లీ మంచి రోజులు వస్తాయని భావించిన తెలంగాణ ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించిన స్వర్ణకారులు రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఇంకా అన్యాయం జరుగుతూనే ఉందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత కూడా స్వర్ణకారుల మనగడను దెబ్బ తీసే విధంగా కార్పొరేట్ తరహాల నూతనంగా జ్యువెలరీ షాపులు, షోరూములు విచ్చలవిడిగా ఏర్పడుతున్నాయని అన్నారు. దీంతో స్వర్ణకారులు కులవృత్తిని నమ్ముకుని ఉన్న స్వర్ణకారులు కుటుంబాలు రోడ్డుపైన పడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కాగా బంగారం పనులు తక్కువ అవడం వలన గత ఆరు నెలల కాలం సుమారు 10 నుంచి 15 కుటుంబాలు ఆత్మహత్యలకు పాల్పడ్డాయని వివరించారు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే రాబోయే కాలంలో అనేక స్వర్ణకారుల కుటుంబాలు బలవన్మరణాలకు పాల్పడే అవకాశం ఉందని, కావున చేతి వృత్తిదారుల కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. జీవోఎంఎస్ నెంబర్ 272 పటిష్టంగా అమలు చేసి అందులో లోపాలను సవరించి స్వర్ణకారులపై జరుగుతున్న పోలీసు వేధింపులను అరికట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అశోక్, నవీన్, వెంకట్ చారి, సంతోష్ చారి, మందహాస్ చారి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న స్వర్ణకారులు

శ్రీ భద్రావతి భావనాఋషుల కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానం

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని మార్కండేయ పద్మశాలి సంఘం శ్రీ భద్రావతి భావనాఋషుల కళ్యాణ మహోత్సవానికి నూలు పున్నమి మహోత్సవానికి ముఖ్య అతిథిగా జడ్పిటిసి తీగల తిరుమల గౌడ్‌ను మార్కండేయ పద్మశాలి సంఘం సభ్యులు బుధవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కండేయ ఆలయంలో స్వామి వార్లకు కుంభాభిషేకం, గణపతి పూజ, స్వస్తి పుణ్యహావచనము, అఖండ దీపారాధన, ధ్వజరోహణం, హావణ కార్యక్రమము, భక్తుల యజ్ఞోపవీత ధారణ, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ, సాయంకాలం శ్రీ ఉమామహేశ్వరుల, మార్కండేయ స్వామి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు మ్యాక నాగరాజు, ఉపాధ్యక్షులు బొమ్మల ప్రవీణ్, కుందేన వినోద్, ఐరేని రాజేందర్, ప్రధాన కార్యదర్శి బొమ్మర గంగాధర్, ఉప కార్యదర్శి చాట్ల అనిల్, కుచని జగదీష్, కోశాధికారి అందే గణేష్, నారాయణ, పురోహితులు శ్రీ బావి కృష్ణమూర్తి శర్మ ఆలయ పూజారి శివప్రసాద్ శర్మ పాల్గొన్నారు.



ఆహ్వానం అందజేస్తున్న దృశ్యం

ప్రభుత్వం స్పందించకుంటే భిక్షాటన

- జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల పక్షపాతి అని చెప్పుకొని పబ్బం గడుపుతుంది తప్ప, రైతుల సమస్యలపై పరిష్కారానికి కృషి చేయడంలో శూన్యమని, రామారెడ్డి రంగచెరువు మరమ్మతు చేయకపోవడమే నిదర్శనమని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి శుక్రవారంఒక ప్రకటనలో విమర్శించారు. గత నెల జెడ్పి సమావేశంలో రంగ చెరువు అలుగు తెగి నీరు వృధా పోతుందని సమస్య లేవనెత్తిన, స్థానిక ఎంపీపీ దశరథ్‌రెడ్డి ఘటన స్థలానికి వెళ్లి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ అధికారులు స్పందించకపోవడంతో, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వంటవార్పు చేసి, అలుగులో మట్టి పోసి నిరసన తెలుపడంతో, ఆగమేఘాల మీద జేసీబీని తీసుకొచ్చి, రోడ్డు మాత్రమే శుభ్రం చేసి, స్థానిక ఎమ్మెల్యే అధికారులు, చేతులు దులుపుకున్నారని పేర్కొన్నారు. వెంటనే రంగ చెరువును మరమ్మతు చేయాలని, లేదంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భిక్షాటన కార్యక్రమాన్ని చేపట్టి, రైతుల, ప్రజల వద్ద చందాలు పోగుచేసి రంగ చెరువు మరమ్మతును చేపడుతామని హెచ్చరించారు.

ఖండేభల్లూర్‌లో హెచ్ఐవీపై అవగాహన

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని ఖండేభల్లూర్ గ్రామంలో సంపూర్ణ సురక్ష హెచ్ఐవీ ఎయిడ్స్‌పై సేవాసంఘం స్వచ్ఛంద సంస్థ కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో అవగాహన శుక్రవారం అవగాహన కల్పించినట్టు సర్పంచ్ మహనంద దేశాయి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహనంద మాట్లాడుతూ.. గ్రామంలో సుమారుగా రెండు వందల మందికి బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. ఓఆర్‌డబ్ల్యు సునీత, రక్మిని మాట్లాడుతూ.. సర్పంచ్ మహనంద, ఉపసర్పంచ్ విరేశం, బీఆర్ఎస్ నాయకులు శివరాజ్ దేశాయి రూడా రక్త పరీక్షలు చేసుకున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ఓఆర్‌డబ్ల్యు సరోజన, పీఈలు శిలాబాయి, రాజమని, ఏఎన్ఎం, ఆశాలు రుక్మిని, సునంద, అంగన్‌వాడీ టీచర్ దీవెన తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

నిజాంసాగర్ నీటి విడుదల

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టు రైతులకు 1400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ శివ తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు కాగా ప్రస్తుతం నీటిమట్టం 1403.87 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 17.802 టీఎంసీలకు ప్రస్తుతం 16. 178 టీఎంసీలుగా ఉందని ఆయన తెలిపారు. నీటిని వదులుతున్న క్రమంలో ఆయకట్టు రైతులు దీన్ని గమనించాలని ఆయన కోరారు.

నేడే ఎల్లారెడ్డిలో జాబ్ మేళా

నవతెలంగాణ-సదాశివనగర్

ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేటు రంగంలో ఉపాధి కోసం కాంగ్రెస్ నేత మదన్ మోహన్ ఆధ్వర్యంలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు శనివారం తెలిపారు. నియోజకవర్గంలోని యువతీ యువకులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూలు మదన్ మోహన్ కాంగ్రెస్ కార్యాలయంలో ఉంటుందని తెలిపారు. జాబ్ మేళాకు వచ్చే వారికి మధ్యాహ్నం భోజన సౌకర్యం ఉంటుందని తెలిపారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-రామారెడ్డి

భోజన విరామ సమయంలో పాఠశాల ఉపాధ్యాయులు పింఛన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిపిఎస్‌ను రద్దుచేసి, ఓపిఎస్‌ను పునరుద్ధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిఆర్‌టియు కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల లక్ష్మీరాజ్యం, నరేష్, సుధారాణి, మహేందర్, ప్రశాంత్, భైరవ ప్రసాద్, నవిత తదితరులు ఉన్నారు.

కొడిచర్ల గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం



గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని కోడిచర్ల గ్రామంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధినిరోధక టీకాలను పశు వైద్యులు డాక్టర్ సురేష్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పుష్పలత, పశువైద్యులు డా.సురేష్‌కుమార్, సిబ్బంది సుధీర్, గోపాలమిత్రులు నగేశ్, రియాజ్, సాయిలు, నాయకులు భీమయ్య, పశుపెంపకందారులు పాల్గొన్నారు.

షబ్బీర్ అలీ ఫౌండేషన్ ఆర్థికసాయం

నవతెలంగాణ-మాచారెడ్డి

మండలంలోని గజియా నాయక్ తండాకు చెందిన లావడియ శ్రీనివాస్ గత కొన్ని రోజుల నుండి ఆరోగ్య పరిస్థితి బాగాలేక రాత్రి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మతి చెందాడు. అంత్యక్రియలకు శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు రూ.5వేలను షబ్బీర్ అలీ ఫౌండేషన్ ద్వారా అందజేశారు.

తొర్లికొండప్రాథమిక పాఠశాలలో రక్షాబంధన్



నవతెలంగాణ- జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించినట్టు ప్రధానోపాధ్యాయులు ఎల్ ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగం అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ప్రేమాను రాగాలు పెంపొందడానికి గాను రక్షాబంధన్ ఉపయోగపడుతుందన్నారు. అన్నా చెల్లెలు అనుబంధం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవ్ కుమార్, గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ సాగుపై శిక్షణ



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని ఫతేపూర్ గ్రామంలో ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయిల్‌ఫామ్ పంట, సబ్సిడీ వివరాలు, యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్, లక్ష్మి లింబాద్రి, పీఏసీఎస్ చైర్మన్, రైతులు, ఉద్యాన శాఖ అధికారి సుమన్, ప్రియునిక్ ఆయిల్ పామ్ కంపెనీ, డి జి ఎం ఏఈఓ నరేష్, ఆయిల్‌ఫామ్ కంపెనీ ఏరియా మేనేజర్ నవీన్, కంపెనీ ప్రతినిధి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి

• సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు



ఏఎన్‌ఎంలకు మద్దతు తెలుపుతున్న రమేష్‌బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంట్రాక్ట్ సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం18వ రోజు రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలో సెకండ్ ఏఎన్‌ఎంలు ధర్నా చౌక్ లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సంఘీభావం ప్రకటించి రమేష్ బాబు మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ తెలంగాణ ఉద్యమం సందర్భంగా రాష్ట్రంలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు అందర్నీ రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. తెలంగాణ ఏర్పడి ప్రభుత్వం కెసిఆర్ ముఖ్యమంత్రిగా పది సంవత్సరాలు అవుతున్నప్పటికీ హామీ అమలు చేయలేదన్నారు. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తీర్పు ఇచ్చినప్పటికీ దాన్ని కూడా అమలు జరపకుండా కాంట్రాక్ట్ ఏఎన్‌ఎం లను రెగ్యులరైజ్ చేయకుండా, కొత్తగా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడం అంటే ఏఎన్‌ఎంలైన మహిళల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడమే అవుతుందని అన్నారు. 18 రోజులుగా రోడ్ల నెక్కి తమ నిరసనను వెలుగుతుంటే ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయటం సరైంది కాదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే అందరిని రెగ్యులరైజ్ చేయాలని ఎంట్రెన్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి ఉద్యోగులు తగిన గుణపాఠం చెప్పే పరిస్థితి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో గంగా, జమున, సరోజ, అనిత, సావిత్రి, సంగీత, కవిత, పాల్గొన్నారు.

వ్యాపారాలతో ఆర్థిక అభివృద్ధి సాధించాలి

• డీఆర్‌డీవో పీడీ చందర్ నాయక్



మాట్లాడుతున్న పీడీ చందర్‌నాయక్

నవతెలంగాణ-భీంగల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐకెపి ద్వారా మహిళా సంఘాలకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని వాటి ద్వారా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థిక అభివృద్ధిని సాధించాలని డి ఆర్ డి ఓ పిడి చందర్ నాయక్ తెలిపారు. న్యూ ఎంటర్ప్రైజెస్ ద్వారా 3 లక్షల రుణంతో పురానిపేట గ్రామంలో ఏర్పాటు చేసిన సూపర్ మార్కెట్‌ను పిడి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఐకేపీ ఆధ్వర్యంలో అన్ని గ్రామాలలో మహిళా సంఘ సభ్యులు కిరాణా షాపులకు, జనరల్ స్టోర్స్ , ఆహార ఉత్పత్తులు పెంపొందించుటకు కులవృత్తులు, బట్టల షాపులకు టైలరింగ్‌కు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఐకెపి ద్వారా మూడు లక్షల రూపాయల అందజేస్తుందని, కనుక దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు , ఇప్పటివరకు ఎంటర్ ప్రైజెస్ కింద మండలంలో 342 యూనిట్లను ఎంటర్ చేయడం జరిగింది అన్నారు. యూనిట్లన్నీ వారం రోజుల్లో గ్రౌండ్‌చేసి మహిళా సంఘ సభ్యులను ఆదాయ అభివృద్ధిలో పెంపొందించుటకు కృషి చేయాలన్నారు. బ్యాంకు లింకేజ్. స్త్రీనిధి పుస్తకాల నిర్వహణ, సమావేశాలు, ఆన్లైన్ వర్క్స్ఎం లోకస్ యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపిడి మధుసూదన్ డిపిఎం మారుతి, ఎంపీడీవో రాజేశ్వర్, సీనియర్ సిసి పురస్తూ నరేష్, ఐకెపి సీసీ, స్త్రీనిధి మేనేజర్ సురేష్. పాల్గొన్నారు

సొంతగూటికి చేరిన ఎంపీటీసీ

• పార్టీ కండువా కప్పిన పైడి రాకేష్ రెడ్డి



కండువావేస్తున్న పైడి రాకేష్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

దత్తాపూర్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ గంగదేవి మహేష్ దంపతులకు బీజెపి నాయకుడు పైడి రాకేష్ రెడ్డి పార్టీ కండువా కప్పి శుక్రవారం పార్టీలోకి ఆహ్వానించారు. గతంలో బీజేపీలో గెలిచి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లి తిరిగి సొంతగుటికి చేరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ లోకి రావాలని ఒత్తిడి చేసి బలవంతంగా అధికార పార్టీలో చేర్చుకున్నారని అన్నారు. అయిన అభివృద్ధికి నిధులు ఇవ్వలేదని తెలిపారు. బీజేపీలోకి రావడం సంతోషంగా ఉందని, అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్మూర్‌లో బీజేపీ గెలువడం తథ్యం అని అన్నారు. రాకేష్ రెడ్డి మాట్లాడుతూ అక్రమాలు కబ్జాలు పోవాలి అంటే బీజేపీ గెలుపు ఆర్మూర్ లో అత్యవసరం అని అన్నారు. కార్యక్రమంలో డొంకేశ్వర్ మండల అధ్యక్షుడు సురేందర్, ఎంపీటీసీలు సంజీవ్, చిన్నారెడ్డి, బీజేపీ అసెంబ్లి కన్వీనర్ పలేపు రాజు,కళ్లెం సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి

నవతెలంగాణ-మోపాల్

చేపల వేటకు వెళ్లి ఒకరు మృతిచెందారు. ఈఘటన మండలంలోని కులాస్‌పూర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ ఎల్, రామ్ వివరాల ప్రకారం.. చెంచయ్య ఇటీవల కాలంలోనే బ్రతుకుతెరువు కోసం నెల్లూరు జిల్లా నుండి ఇటుక బట్టీలో పని చేయడానికి ఇక్కడికి వచ్చాడు. శుక్రవారం చెరువులో చేపలవేటకు వెళ్లి మృతిచెందాడు. మృతదేహంకోసం గజ ఈతగాళ్లతో వెతికించిన లభ్యం కాలేదని ఆయన తెలిపారు.

కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే

99 శాతం హామీలు అమలు చేశాం

• కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 99 శాతం హామీలు అమలు చేశామని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ భవన్‌లో పీసీసీ ఉపాధ్యక్షులు తాహేర్ బిన్ హందన్, అధికార ప్రతినిధులు ఏబి శ్రీనివాస్, దామోదర్ రావు తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కర్ణాటక రాష్ట్రంలో 100 రోజుల్లో ఇచ్చిన ఐదు హామీలలో నాలుగింటిని నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం, అన్నభాగ్యలో ఒక్కొక్కరికి నెలకు రూ.170 లను అందిస్తున్నారని అన్నారు. 200యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకంలో 1.56 కోట్ల మందికి లబ్ది చేకూరిందని తెలిపారు. కేవలం వంద రోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన ఐదు హామీల్లో నాలుగు హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చిందని అన్నారు. మిగిలిన పథకమైన యువనిధిని కూడా త్వరలో ప్రారంభిస్తారని ఆయన అన్నారు. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ మహిళలకు భరోసానిచ్చేందుకు ఎన్నికలో ఇచ్చిన హామీ మేరకు గృహలక్ష్మి పథకం ద్వారా ప్రతీ మహిళకు నెలకు రూ.2 వేల నగదు బదిలీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ప్రతిపక్ష నాయకులు అమలుకు సాధ్యం కానీ హామీలని ఎంత దుష్ప్రచారం చేసిన అమలు చేశారన్నారు. రేపు తెలంగాణలో ఏర్పడబోయే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన రైతు డిక్లరేషన్, యువ డిక్లరేషన్, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లను కూడా అమలుచేసి తీరుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర పిసిసి అధికార ప్రతినిధి ఏబి శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'గృహలక్ష్మి పథకం ద్వారా 1.26 కోట్ల కుటుంబ మహిళ పెద్దలకు నెల నెల రూ.2వేల. ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్న 1.1 కోట్ల మంది మహిళల ఖాతాలకు బుధవారం నగదు జమ అయిందని అన్నారు. ఈ గ్యారెంటీ పథకాలు అమలు చేస్తే ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని ప్రధాని మోదీ సహా బీజేపీ నేతలు ఎద్దేవా చేశారని అన్నారు. తెలంగాణలో కూడా బీఆర్ఎస్, బిజెపి ఒకటే అనే విషయం ప్రజలకు అర్థమైందని రానున్న ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురాబోతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురాగానే కర్ణాటక తరహాలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రామర్తి గోపి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కేశ మహేష్, అబూద్ బిన్ అబ్దుల్లా, నగర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రీతం, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, నవాజ్, అష్రఫ్, శోభన్, అజీజ్ అన్సారీ ,కంది కంటి నరేందర్ గౌడ్, ముష్క పటేల్ పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం

• ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రామాల్లో అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని, గతంలో పాలించిన వారు అభివృద్ధి చేయకుండా గాలికి వదిలేశారని, బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామంలో రూపు రేఖలు మారిపోయాయని, సంక్షేమంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర సర్కార్ కృషి చేస్తుందని ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు.శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మండలం లోని ఆయా గ్రామాలలో కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకోసం ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ... తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక అన్ని కులాల వారికి ప్రభుత్వ సంక్షేమంలో సమన్యాయం చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి వివిధ కుల సంఘాలకు16 కోట్లు మంజూరు అయ్యాయని ఆయన వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వివిధ కుల సంఘాలకు రూ.16 కోట్లు మంజూరు అయ్యాయని, దీంట్లో భాగంగానే వివిధ మండలాలకు చెందిన కుల సంఘ సభ్యులకు ప్రొసిడింగ్ పత్రాలు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. డిచ్‌పల్లి మండలంలోని బర్దిపూర్ గ్రామ ఎస్సీ మాల సంఘం, నర్సింగాపూర్ (కొత్తపేట) ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌కు, రాంపూర్ గ్రామ గంగపుత్ర సంఘానికి రూ.5 లక్షల చొప్పున ప్రొసీడింట్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్లు, కుల సంఘ సభ్యులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హరితహారంలో మొక్కలను ఎక్కడ నాటారు.?

• కలెక్టర్ స్పందించాలి



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

హరితహారంలో మొక్కల విషయంలో ఎక్కడ నాటారు.. నాటిన వివరాలు గురించి, బీఆర్ఎస్ ఫ్లెక్సీలు కట్టి పది రోజులు అవుతుందని, వాటి వల్ల ప్రజలు, వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతున్నారని దీనిపై కలెక్టర్ స్పందించాలని బిజెపి పట్టణ అధ్యక్షులు ధ్యాగ ఉదయ్ అన్నారు. శుక్రవారం పట్టణ మున్సిపల్ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు మాట్లాడుతూ... ఇటీవల పట్టణంలోని అంగడి బజార్ మార్కెట్ యార్డ్ కట్టిన మడిగలను వ్యాపారులకు పంచాలని, లబ్ధిదారులు వెంటనే వ్యాపారాలు మొదలు పెట్టాలని పరిరక్షించడం జరిగిందన్నారు. అక్కడ చూస్తే హరితహారం మొక్కలు పడేసి ఉన్నాయని తెలిపారు. వాటిపై వివరణ అడిగితే వెంటనే మరుసటి రోజు అక్కడి నుంచి ఆ మొక్కలను చెత్తకుప్పలో పడేసి మాయం చేశారని అన్నారు. హరితహారం మొక్కలు ఎక్కడ నాటారు.. ఎవరికి పంచారు.. వాటి వివరాలు ఇవ్వమని అడిగితే మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ ఆఫీసులో లేకుండా తిరుగుతున్నారని తెలిపారు. సిబ్బంది కూడా వాటి గురించి వివరాలు తెలియదని చెప్తున్నారని అన్నారు. హరితహారం మొక్కలపై వెచ్చించే డబ్బులు మట్టిపాలు చేశారని తెలిపారు. ఆర్మూర్ మున్సిపల్ అవినీతికి అడ్డగా మారిందని, వెంటనే దీనిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆశీర్వాద సభ అని బీఆర్ఎస్ నాయకులు కట్టిన ఫ్లెక్సీలు పది రోజులు అవుతున్న వ్యాపారస్తులు ప్రజలు ఇబ్బందులు పడుతున్న వాటిని తొలగించకపోగా కమిషనర్ వారికి వత్తాసు పలుకుతూ మాట్లాడడం మెమోరాండం ఇచ్చినా గాని చర్యలు తీసుకోలేదన్నారు. కమిషనర్ బీజేపీ రాజకీయాలు చేస్తుందని వ్యాఖ్యానించడంపై టిఆర్ఎస్ పార్టీకి తొత్తుగా మారినందుకు వెంటనే కమిషనర్ ఉద్యోగానికి రాజీనామా చేసి బీఆర్ఎస్ కండువా కప్పుకొని రాజకీయం చేసుకోవాలని హెచ్చరించారు. కలెక్టర్ వెంటనే మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని కోరారు. లేకపోతే పెద్ద ఎత్తున కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు నూతన శ్రీనివాస్ రెడ్డి, జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి మందుల బాలు, పట్టణ కార్యదర్శి పులి యుగేందర్, గుగులోత్ తిరుపతి నాయక్, గోవింద్‌పేట్ ఎంపీటీసీ యల్ల రాజ్ కుమార్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు బాసెట్టి రాజ్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

నగర 15వ మహాసభను జయప్రదం చేయండి

• ఎస్ఎఫ్ఐ



మాట్లాడుతున్న విశాల్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ నగర 15 మహాసభను జయప్రదం చేయండి అని ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు వాగ్మారే విశాల్ తెలిపారు. శుక్రవారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని స్థానిక శివాజీ నగర్ నందుగల బాలుర ఐటిఐ కళాశాల నందు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షులు వాగ్మరే విశాల్ మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐ నిజామాబాద్‌నగర 15వ మహాసభలు ఈనెల 5న నిజామాబాద్ నగరంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభల్లో గత కార్యక్రమాల సమీక్ష భవిష్యత్తు కార్యక్రమాలను రూపొందించుకుంటామని అన్నారు. ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ విద్యా రంగం అభివృద్ధి చేయాలని సమరశీల పోరాటాల కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందని అన్నారు. వృత్తివిద్య అయిన ఐటిఐ కాలేజీలో సరైన పరికరాలు లేక విద్యార్థులకు సరైన భోధన జరగడం లేదన్నారు. ఐటిఐలో కోర్సు పూర్తి అయినాక పేరున్న కంపెనీస్ అప్రెంటిస్ కొరకు అనుకున్న స్థాయిలో రాకపోవడం వల్ల విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు గణేష్,నగర నాయకులు ఉద్ధవ్, శివ, ఐటిఐ, ఎస్ఎఫ్ ఐ కాలేజీ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

17వ రోజు ఏఎన్‌ఎంల సమ్మె



మాట్లాడుతున్న ఓమయ్య

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఏఎన్‌ఎంల 17వ రోజు సమ్మెలో భాగంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిజామాబాద్ కొత్త కలెక్టర్ ఆఫీస్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భారతమ్మ మాట్లాడుతూ 17 రోజులుగా సమ్మె చేస్తా ఉంటే ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో జరాల బారిన పడిన ప్రజలు, చిన్నపిల్లలు, గర్భవతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారి ఆరోగ్యం గురించి ఆలోచించైనా తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధికారులు షోకాస్ నోటీసుల ద్వారా ఉద్యోగాల నుండి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని, వారి బెదిరింపులకు ఏఎన్‌ఎంలు భయపడరని అర్థం చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భేషజాలకు పోకుండా ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయడంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేసుకోవాలని అన్నారు. లేకుంటే సమ్మె మరింత ఉధృతం చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కళావతి, భాగ్యలక్ష్మి, సుజాత, విట్టా బాయ్, సరస్వతి, శశికళ, వనజ, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాల పరామర్శ

నవతెలంగాణ - ముప్కాల్

ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన కొమ్ముల సత్యం (38) బీజేపీ యువనాయకులు గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. మృతిని అంత్యక్రియల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి పాల్గొని నివాళులు అర్పించారు. మండల కేంద్రానికి చెందిన ముస్కు ముత్తెన్న (టీడీపీ సీనియర్ నాయకులు) ఇటీవలే అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న మల్లికార్జున రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు గడ్డం సంతోష్ రెడ్డి, ముస్కు నర్సయ్య, మెడికల్ విక్రమ్, మ్యాక నర్సయ్య, చిల్క దినేష్, శేఖర్ తదితరులు ఉన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న వీవోఏలు

నవతెలంగాణ - ముప్కాల్

రాష్ట్రంలోని మహిళా సంఘాల సహాయకుల (వీవోఏ)ల వేతనాలు రూ.8 వేలకు పెంచుతూ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేయడంతో శుక్రవారం మండల కేంద్రంలో వీవోఏలు సీఎం కేసీఆర్, మంత్రివర్యులు వేముల ప్రశాంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం వీవోఏల సంఘం అధ్యక్షురాలు అరుణ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మా పనిని చూసి సముచిత స్థానం కల్పించి వేతనాలు పెంచడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల వీవోఏల అధ్యక్షురాలు అరుణ, కావ్య, అర్చన, భాగ్యలక్ష్మి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

రేపు కామ్రేడ్ రామచంద్రన్ వర్ధంతి

నవతెలంగాణ-ఆర్మూర్

భారత విప్లవోద్యమ నేత సిపిఐ (ఎంఎల్). కేంద్ర కమిటీ కార్యదర్శి

కామ్రేడ్ రామచంద్రన్ 15వ వర్ధంతి సభ పట్టణ కేంద్రంలో ఈనెల 3న నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ సభను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) రామచంద్రన్ పార్టీ ఉత్తర తెలంగాణ కార్యదర్శి కార్యదర్శి ఎస్ సుధాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కామ్రేడ్ రామచంద్రన్ కేరళ రాష్ట్రంలో త్రిచూర్ జిల్లాలోజన్మించారన్నారు. అక్కడ ప్రజాఉద్యమంలో పాల్గొంటూ ముంబాయి. వచ్చి అక్కడ ఎయిర్ పోర్టు లోకార్మిక రంగాన్ని బలపయితం చేస్తూ భారతదేశం మొత్తం తిరుగుతూ 15 రాష్ట్రాలకు సిపిఐ (ఎంఎల్).పార్టి ముందుకు తీసుకు వెళ్లారని అన్నారు. క్యాన్సర్ వ్యాధితో పోరాడుతూ అనేక ఉద్యమాలు చేసి మృతిచెందారన్నారు. ఆయన ఆశల కోసం. ముందుండి పోరాడాలని. ఆయన కన్నా కళల్ని .నిజం చేయాలని పిలుపునిచ్చారు.

ఆరు లక్షల నిధులు మంజూరు



ప్రొసీడింగ్‌కాపీ అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ కొరకు రూ 3 లక్షల ప్రొసీడింగ్ పత్రాలను, భక్త మార్కండేయ పద్మశాలి సంఘం హాల్ కొరకు రూ 3 లక్షల ప్రొసీడింగ్ పత్రాలను రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మోపాల్ సర్పంచ్ క్యాతం రవి, ఎంపీటీసీ ముత్తన్న, టిఆర్ఎస్ నాయకులు కెంపు భూమయ్య, కెంపు సాయిలు, ఎల్లోల్ల రాజాశేఖర్ రెడ్డి, తదితర కుల సంఘాల పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంతో పాటు మండలంలోని నల్లూరు, నాగంపేట్, రెంజర్ల, వెంచిర్యాల గ్రామాలకు చెందిన 14 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు శుక్రవారం పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షులు పెంటు గంగాధర్, ప్రధాన కార్యదర్శి ఉమ శంకర్, శ్రీనివాస్ గౌడ్, బ్రమ్మదండి లింగం, ఆయా గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ గ్రామాల అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్ భవనం మంజూరి చేయాలి

● ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-బోధన్

మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో మత్స్యకారుల సౌకర్యార్థం చేపల విక్రయించేందుకు గాను చేపల మార్కెట్ భవనం మంజూరి చేయాలని కోరుతూ శుక్రవారం బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామానికి చెందిన మత్స్య సహకార సంఘం సభ్యులు ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వారి విన్నపానికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ చేపల మార్కెట్ భవన నిర్మాణం కొరకు రూ.25 లక్షలు మంజూరి చేస్తానని హామీ ఇచ్చినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఎమ్మెల్యేకు కలిసిన వారిలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సిర్ప సుదర్శన్, సీనియర్ నాయకులు మాగిరి పోశెట్టి, గ్రామ అధ్యక్షులు కుర్మే రాజు, నాయకులు నీరడి బాబురావు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులున్నారు.

5

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

శనివారం | సెప్టెంబర్ 02, 2023 | www.navatelangana.com

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా అబ్రబోయిన స్వామి

నవతెలంగాణ-దోమకొండ



తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన అబ్రబోయిన స్వామి శుక్రవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ నియామకపత్రాన్ని అందజేశారు. గతంలో అబ్రబోయిన స్వామి ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షునిగా, జిల్లా కన్వీనర్‌గా పనిచేశారు. ఆయన ముదిరాజ్‌ల ఐక్యత కోసం గత 20 సంవత్సరాలుగా చేసిన సేవను గుర్తించి రాష్ట్ర కమిటీలో చోటు కల్పించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల ఐక్యత కోసం, సంఘం పటిష్టత కోసం తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. తనపై నమ్మకంతో రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

చీకటి నింపే సీపీఎస్ మాకొద్దు

● సీపీఎస్ రద్దు చేయాలి ● ఉపాధ్యాయుల డిమాండ్ ● పలుచోట్ల నిరసన

నవతెలంగాణ-విలేకరుల బృందం

తెలంగాణ ప్రభుత్వం తక్షణమే సిపిఎస్ విధానం రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం ఉపాధ్యాయులు పలుచోట్ల నిరసన చేపట్టారు.

బోధన్ : మండలంలో శిక్షణలో ఉన్న ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ డివిజన్ ఇంచార్జ్ ఎంబెల్లి శంకర్ మాట్లాడుతూ ఎందరో ఉద్యోగ ఉపాధ్యాయుల జీవితాల్లో చీకటి నింపే సిపిఎస్‌ను ప్రభుత్వం రద్దు చేయాలని, తిరిగి ఉద్యోగ ఉపాధ్యాయులను పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు సోమలింగంగౌడ్, చందూర్ అధ్యక్షులు రామచందర్, సాలూర మండల ప్రధాన కార్యదర్శి రవి సాయిలు, బోధన్ అర్బన్ ప్రధాన కార్యదర్శి గంగాధర్, రాష్ట్ర బాధ్యులు హర్షద్, రవి, శివరాజ్, రాజేందర్‌సింగ్, నరేష్, సతీష్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్ : ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పిఆర్టియూ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మధ్యాహ్న భోజనం విరామ సమయంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. నసురుల్లాబాద్ మండల పిఆర్టియూ నాయకులు హన్మండ్లు, భూషణ్ మాట్లాడుతూ సిపిఎస్ విధానం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలిగి, రిటైర్ అయిన తరువాత వారికి సామాజిక, ఆర్థిక భద్రత లేకుండా పోతుందన్నారు. ఈ సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ఉపాధ్యాయులు తదితరులు హాజరయ్యారు.

జుక్కల్ : పెన్షన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను పునరిద్ధరించాలని పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జుక్కల్‌లో నల్ల బ్యాడ్జిలతో నిసరన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జుక్కల్ మండలాధ్యక్షుడు బస్వంత్ పటేల్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబుసార్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, చంద్రకాంత్‌గౌడ్, ఉపాధ్యాయులు మదుసూధన్, బాలాజీ, సీహెచ్.సంతోష్, విష్ణుదాస్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : సెప్టెంబర్ 1 సిపిఎస్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని పిఆర్‌టియు టిఎస్ లింగంపేట్ మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పిఆర్టియు మండలాధ్యక్షులు సురేష్, ప్రధాన కార్యదర్శి రజనికాంత్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రవీంద్ర శర్మ, శ్రీకాంత్, స్వామి, పారు, వీరేందర్, విక్రమ్, మోహన్, బాల్సింగ్ వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నసురుల్లాబాద్ : నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

రెంజల్ : మండల కేంద్రంలో బోధన్ నియోజకవర్గ బీజేపీ కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కరణ్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షులు గోపికృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సంగం శ్రీనివాస్, మాజీ మండలాధ్యక్షులు సంతోష్, బీజేపీ సీనియర్ నాయకులు (బుజ్జి) మండల ఉపాధ్యక్షులు యోగేష్, బీజేపీ మాజీ మండలాధ్యక్షులు మేక సంతోష్, మండల కార్యదర్శి సంఘం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూర్ : ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పిఆర్టియు జిల్లా అధ్యక్షులు దామోదర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో గల బాలికల ఉన్నత పాఠశాలలో సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసే వరకు పిఆర్టియు నిరంతర పోరాటం చేస్తుందని, సిపిఎస్ వల్ల ఎంతో మంది ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదగిరి, ఉపాధ్యాయులు గిరిధర్, మధుసుధన్, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని కాటేపల్లి గ్రామంలో సీసీ రోడ్డు మురికి కాలువలు పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జుక్కల్ శాసన సభ్యులు హన్మంత్ షిండే సహకారంతో మండలంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొత్సం విట్టల్, సొసైటీ చైర్మన్ హనుమంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు విజయ దేశాయ్, బీఆర్ఎస్ యూత్ మండల ప్రెసిడెంట్ రమేష్, జానీ, హనుమంత్‌రెడ్డి, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

నవతెలంగాణ-కోటగిరి

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎత్తొండ గ్రామంలో చదువుతున్న విద్యార్థులందరికీ మొత్తం 75 స్కూల్ బ్యాగులను బస్సాపూర్ గ్రామానికి చెందిన బిల్డర్ ముమ్మలనేని రాజశేఖర్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నాగనాథ్ మాట్లాడుతూ.. సంపన్నులు చాల మంది ఉంటారని, పేదలకు తమవంతు సహాయ సహకారాలు అందించే గుణం కొంతమందికి మాత్రమే ఉంటుందని కొనియాడారు. అలాంటి వ్యక్తులలో రాజశేఖర్ ఒకరని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగరాజులు, హైస్కూలు ఇంచార్జ్ ప్రధానో పాధ్యా యులు శ్రీలోల శంకర్, పిఆర్‌టియు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు శానం సాయిలు, మాజీ సర్పంచ్ ఆనంద్, ఉపాధ్యాయులు సునీత కుమారి, పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరఫీ పరీక్షలు

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని భవిత సెంటర్లో విద్యనభ్యసిస్తున్న 9 మంది వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ విశాలాక్షి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫిజియోథెరపీ పరీక్షలు వికలాంగ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతాయని ఆమె కొనియాడారు. నిరంతరం పరీక్షలు నిర్వహించడం మూలాన అవయవ మార్పిడి కలిగి పట్టుత్వం వల్ల వికలాంగ లోపం తగ్గి శరీరానికి బలం చేకూరుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కమల్ కిషోర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేసీఆర్, హరీష్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-కోటగిరి

వీవోఏలు రూ.8వేలు వేతనం పెంచిన సందర్భంగా సీఎం కెసిఆర్, ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చిత్రపటాలకు మండల మహిళ సమైక్య కార్యాలయం ముందు శుక్రవారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు సరిత, ఉపాధ్యక్షుడు సాయిలు, కార్యదర్శి రమేష్, కోశాధికారి సుమ, సహాయ కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు రోగ నిర్ధారణ సర్వే

నవతెలంగాణ-మాచారెడ్డి

మండలంలోని లక్ష్మణరావుపల్లి గ్రామ ఆరోగ్య సిబ్బంది శుక్రవారం కుష్టి రోగనిర్ధారణ సర్వేలో భాగంగా గ్రామంలో ఇంటింటికీ ఆశా కార్యకర్తలు తిరుగుతూ అనుమానమున్న వ్యక్తుల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్త మాట్లాడుతూ కుష్టు నిర్ధారణకు గ్రామంలోని ప్రతి ఒక్కరు సహకరించాలని ఆమె సూచించారు

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ సర్పంచ్‌ల చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న పలువురు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఇద్దరు సర్పంచ్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎల్లారెడ్డిలోని మదన్మోహన్ కార్యాలయంలో శుక్రవారం వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. మండలంలోని ఒంటర్‌పల్లి సర్పంచ్ రాజన్న, ఎల్లారం సర్పంచ్ మల్లయ్య, తాడ్వాయి మండలం సంగోజీవాడి మాజీ సర్పంచ్ రాములు, బ్రాహ్మణపల్లి మాజీ సర్పంచ్ సంగయ్య, రాజంపేట్ మండలం ఎల్లపూర్ తండా మాజీ సర్పంచ్ దీప్ల నాయక్, ఎల్లారెడ్డిపల్లి బీజేపీ నాయకులు, నాగిరెడ్డిపేట్ మండలం బంజారా తండా మాజీ సర్పంచ్ బన్సీ నాయక్, నాగిరెడ్డిపేట్ మండల నాయకులు, వివిధ గ్రామాల బీజేపీ, బీజేవైఎం, బీఆర్ఎస్ నాయకులు, వార్డ్‌మెంబర్స్, యూత్ నాయకులు పెద్దఎత్తున మదన్‌మోహన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని దళితవాడకు చెందిన కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున అధికార పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నరసింహారెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తుందని గుర్తు చేశారు. వాటికి ఆకర్షితులవుతూ ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తమ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, పట్టణ సర్పంచ్ వేణు, మార్కెట్ కమిటీ అధ్యక్షులు హనుమంత్‌రెడ్డి, సిద్ధిరామేశ్వర ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు మల్లేశం, నాయకులు బండి రాములు, నాగభూషణం గౌడ్, ప్రభాకర్, బసవయ్య పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-భిక్కనూర్

బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ఛలో గజ్వేల్ కార్యక్రమానికి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో బీజేపీ నాయకులు, కార్యకర్తలు అక్కడికి వెళ్లకుండా ముందస్తుగా నాయకులను పోలీసులు అరెస్టు చేసి పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో మండల ఇన్చార్జ్ శ్రీధర్‌రెడ్డి, మండల కోశాధికారి జైపాల్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, నాయకులు సాయిరెడ్డి, మహేందర్, రాములు, తదితరులున్నారు.

మల్లారంలో పశువులకు టీకాలు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మల్లారం గ్రామంలోని పశువులకు పశువుల డాక్టర్ గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతకింది నగేష్, వైసీపీ ఎంపీపీ అన్నం సాయిలు పాల్గొన్నారు.

ముదిరాజుల సమస్యలు పరిష్కరిస్తాం

● ఫిషరీస్ రాష్ట్ర చైర్మెన్ పిట్టల రవీందర్

నవతెలంగాణ-తాడ్వాయి

నెలరోజుల్లో ముదిరాజుల సమస్యలు పరిష్కరిస్తామని ఫిషరీస్ రాష్ట్ర చైర్మెన్ పిట్టల రవీందర్, గీత పారిశ్రామిక ఫెడరేషన్ చైర్మెన్ పల్లె రవిగౌడ్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా జనాభా ఉన్న ముదిరాజ్‌లకు వృత్తిపరంగా న్యాయం చేయాలనే దృష్టితో త్వరలో అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని సీఎం కేసీఆర్ ఆదేశించినట్లు తెలిపారు. అవకాశం ఉన్నచోట ముదిరాజ్‌లకు సొసైటీలలో సభ్యత్వం కల్పిస్తామని చెప్పారు. స్వయంగా సీఎం ఈ నియోజకవర్గంలో పోటీ చేస్తున్నారని మత్స్యకారులకు మంచి రోజులు వస్తాయని వివరించారు. ప్రతీ కుటుంబంలో కనీసం ఒక్కరికైనా మత్స్యశాఖ సొసైటీలో సభ్యత్వం కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామగ్రామాన కమ్యూనిటీ హాలు, పెద్దమ్మ తల్లి, గంగమ్మ ఆలయాలు నిర్మిస్తామన్నారు. ఈ మూడు నెలల్లో మత్స్యకారుల సమస్యలు పూర్తిగా పరిష్కరిస్తామని తెలిపారు. ఆందోళన చెందాల్సిన పనిలేదని హామీనిచ్చారు. కామారెడ్డి-నిజామాబాద్ జిల్లాల రూపురేఖలు మారే అవకాశం వచ్చిందన్నారు. అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడం కోసమే సీఎం కామారెడ్డి జిల్లాలో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కామారెడ్డికి వచ్చారని వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు డాక్టర్ భట్టు విఠల్ మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటు చేసిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులకు టూ వీలర్, ఫోర్ వీలర్ వాహనాలు 100శాతం సబ్సిడీతో ఇవ్వాలని కోరారు. మత్స్యకారులందరికీ బీసీబంధులో భాగంగా అవకాశం ఇవ్వాలని, రాష్ట్ర జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు నీలకంఠం ముదిరాజ్ కోరారు. సమావేశంలో మహాసభ నాయకులు చంద్రం, బుచ్చన్న, రమేష్, గోవర్ధన్, సాయిలు, వెంకటేష్, రంగయ్య, బాలరాజు, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫిషరీస్ చైర్మెన్ పిట్టల రవీందర్

ఘనంగా మేడపాటి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-బోధన్

బోధన్ నియోజకవర్గ బిజెపి నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం బోధన్ మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాలూర మండలంలో కార్యకర్తలు కేక్ కట్ చేసి జన్మదిన సంబరాలు నిర్వహించారు. హూన్స గ్రామంలో మాజీ సొసైటీ చైర్మన్ ఈర్వంత్ రావు పటేల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే బోధన్ జిల్లా ఆస్పత్రిలో నాయకులు రోగులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం శివాలయంలో పూజలు చేసి అంబేద్కర్ చౌరస్తాలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, పట్టణ అధ్యక్షుడు బాలరాజు, ప్రధాన కార్యదర్శి వాసు, బీసీ మోర్చా పట్టణ అధ్యక్షులు గుంత గంగాధర్, కిసాన్ మోర్చా ఏశాల సూరి, ఎస్సీ మోర్చా కలికోటి కృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్ గంగుల శ్రీకాంత్, ముట్టెన్ ప్రకాశ్, మారుతి, కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

రెంజల్ : మండల కేంద్రంలో బోధన్ నియోజకవర్గ బీజేపీ కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కరణ్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షులు గోపికృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సంగం శ్రీనివాస్, మాజీ మండలాధ్యక్షులు సంతోష్, బీజేపీ సీనియర్ నాయకులు (బుజ్జి) మండల ఉపాధ్యక్షులు యోగేష్, బీజేపీ మాజీ మండలాధ్యక్షులు మేక సంతోష్, మండల కార్యదర్శి సంఘం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బోధన్ : అన్నదానం చేస్తున్న నాయకులు

ఉర్సును శాంతియుతంగా నిర్వహించాలి

● బోధన్ ఇంచార్జ్ ఏసీపీ రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బోధన్

ఉర్సు ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలని బోధన్ ఇంచార్జ్ ఏసీపీ రవీందర్ రెడ్డి అన్నారు. పట్టణంలో శుక్రవారం నుంచి ఈనెల 5వ తేదీ వరకు నిర్వహించే జలాల్ బుఖారి దర్గా ఉర్సు ఉత్సవాలను ప్రజలు కులమతాలకతీతంగా పాల్గొని శాంతియుతంగా జరుపుకోవాలని తెలిపారు. శుక్రవారం బోధన్ పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన పోలీసులకు బందోబస్తు నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జలాల్ బుఖారి దర్గా ఉర్సు సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ ఉర్సు ఉత్సవాలకు బోధన్ సబ్ డివిజన్, నిజామాబాద్, ఆర్మూర్, నిజామాబాద్ సబ్ డివిజన్ నుంచి పోలీస్ ఫోర్స్ రప్పించి భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జలాల్ బుఖారీ దర్గా ఉర్సు ఉత్సవాలు ముగిసే వరకు బోధన్ పట్టణంలో 24 చోట్ల సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించి అక్కడ పోలీస్ పికెట్లను ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఈ బందోబస్తు సందర్భంగా మొత్తం 185 మంది పోలీస్ సిబ్బంది విధులలో పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో బోధన్ పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్, సీసీఐ సీఐ ఆంజనేయులు ఉన్నారు.

క్రీడా దుస్తులు, పరికరాలు పంపిణీ

నవతెలంగాణ-బాల్కొండ

ప్రముఖ పారిశ్రామికవేత్త వసంత టూల్స్ క్రాఫ్ట్ హైదరాబాద్ సంస్థ అధినేత చిట్టాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు దయానంద రెడ్డి సహకారంతో క్రీడా దుస్తులు , క్రీడా పరికరాలన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం పంపిణీ చేశారు. బాల్కొండలో మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాల భవనంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్, చిట్టాపూర్ మాజీ సర్పంచ్ న్యావనంది గణేష్ చేతుల మీదుగా విద్యార్థులకు క్రీడా దుస్తులు, పరికరాలు 21 పాఠశాలలకు అందజేశారు. ఒక్కొక్క పాఠశాలకు 50 వేల రూపాయల విలువగల దుస్తులు, పరికరాలు అందజేసినట్లు కార్యక్రమం ఆర్గనైజింగ్ కార్యదర్శి జై డి రాజ్ కుమార్ తెలిపారు. విద్యాధికారి బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ కూడా ఇంత మొత్తాన క్రీడా పరికరాలు , క్రీడా దుస్తులు వీటినే కాకుండా దాదాపుగా 100 పాఠశాలలకు డ్యూయల్ డెస్కు బెంచీలు, సైన్స్ మెటీరియల్, కంప్యూటర్ ప్రభుత్వ పాఠశాలలకు అందించిన గొప్ప వ్యక్తి అని అన్నారు. మరిన్ని పాఠశాలలకు డెస్కులు. క్రీడా దుస్తులు, క్రీడ పరికరాలను అందించాలని కోరారు. చిట్టాపూర్ మాజీ సర్పంచ్ న్యావనంది గణేష్ మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడా దుస్తులు, పరికరాలను సద్వినియోగం చేసుకొని క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్నదే దయానంద రెడ్డి లక్ష్యం అని, దీన్ని వ్యాయామ ఉపాధ్యాయులు నెరవేర్చాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి కే సంగీతరావు, జిల్లా వ్యాయమ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బి మల్లేష్ గౌడ్ , జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం గంగా మోహన్ , వ్యాయామ ఉపాధ్యాయులు పవన్ కుమార్, గంగారెడ్డి, గంగాధర్ 21 పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడా అభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి మృతికి నివాళి



నివాళి అర్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-మాచారెడ్డి

కామారెడ్డి మండలంలోని ఉగ్రవాయి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన సబిత్‌రెడ్డి ఆత్మహత్య చేసుకోవడంతో మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ ఆవరణలో పంచాయతీ కార్యదర్శి సబిత్‌రెడ్డి మృతి పట్ల ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేత

నవతెలంగాణ-బోధన్

మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) కొప్పురి సుజాత ఆమె తండ్రి బాబురావు జ్ఞాపకార్థం శుక్రవారం విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలకు రూ.33వేలు విలువ చేసే క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాను అందించిన ఫాన్స్ క్యాప్స్, ఫ్లాగ్స్ డంబెల్ క్రీడ సామాగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మండల, జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా తయారు కావాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అలీమ్, సీఆర్పీ విజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురు చేరిక

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని అంజని గ్రామానికి చెందిన సాయిరాం, మారుతి, సాయిరాం వారి కుటుంబ సభ్యులు బీఆర్ఎస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో శుక్రవారం చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను చూసి బీఆర్ఎస్‌లో చేరారని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ హనుమంత్ రెడ్డి, బిచ్కుంద మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కండరావు పటేల్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి, సొసైటీ డైరెక్టర్ సాయగౌడ్, ఉప సర్పంచ్ లచ్చగౌడ్, గ్రామపెద్దలు రంజిత్, అంజాగౌడ్, లక్ష్మాగౌడ్, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వినికిడి యంత్రాలు పంపిణీ

నవతెలంగాణ-భిక్కనూర్



మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో చెవిటి వారికి వినికిడి యంత్రాలను ఎంపీపీ గాల్‌రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందని, వికలాంగులు సమాజంలో అన్ని రంగాలలో ముందుకు పోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి అనంతరావు, ఐకెపి ఎపిఎం శ్రీనివాస్, మండల అధికార పార్టీ అధ్యక్షులు నరసింహారెడ్డి, పట్టణ సర్పంచ్ వేణు, సొసైటీ అధ్యక్షులు భూమయ్య, మండల రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ రామచంద్రం, సిద్ధిరామేశ్వర ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ నరేష్, నాయకులు నాగభూషణం గౌడ్, బండి రాములు, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.